# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం కొనసాగుతోంది.**

**2. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

**3. హైదరాబాద్‌లో జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ జోనల్ సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొంటారు.**

**4. వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాహనాలకు అనుమతులు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేశ్ హోంమంత్రి, డీజీపీని కోరారు.**

===========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి – ఎస్ఐపీబీ సమావేశమైంది. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనల చర్చించి ఆమోదం తెలపనున్నారు. అనంతరం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్‌డీఏ అథారిటీ సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే సాయంత్రం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

--------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ కార్యనిర్వహణాధికారి ఎం. రవిచంద్ర గవర్నర్‌కు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు గవర్నర్‌ను ఆశీర్వదించగా రవిచంద్ర తీర్థప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. ఇదిలా ఉండగా.. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఈ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు కల్పవృక్ష వాహనంపై గోవుల గోపన్న అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.. పెద్ద సంఖ్యలో భక్తులు వాహనసేవను వీక్షించి స్వామివారిని దర్శించుకున్నారు.

--------------------------

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పరిటాలవారిపాలెం, ఉప్పలపాడు, జరుగులవారిపాలెం, నాగభైరవునిపాలెం గ్రామాల్లో మంత్రి నిన్న పర్యటించి సుమారు మూడు కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్ 29 సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ జోనల్ సదస్సు ఈ రోజు ప్రారంభమైంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సదస్సులో చర్చిస్తారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయ వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వ్యవసాయ అంశాలను ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, డిజిటల్ వ్యవసాయం, పప్పుధాన్యాల్లో స్వయం సమృద్ధి వంటి అంశాలను మంత్రి ప్రస్తావించనున్నారు. రైతు సంక్షేమం, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమర్థ అమలుపైనా సదస్సులో చర్చించనున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో మంత్రి ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 53 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం కార్యాలయ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు, ఉపాధ్యాయులకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసి, మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'సేవా సంకల్ప అభియాన్' పేరిట ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశంలో ప్రతి ఇంటికి కొళాయి నీరు అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్ గురించి ఈ రోజు తెలుసుకుందాం.

దేశవ్యాప్తంగా గ్రామీణ కుటుంబాలకు సురక్షితమైన కుళాయి నీటిని అందించేందుకు 2019లో ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ ద్వారా ఇప్పటివరకు 12 కోట్ల 60 లక్షలకు పైగా కొత్త కుళాయి కనెక్షన్లు అందించారు. 2019లో దేశంలోని కేవలం 16.7 శాతం గ్రామీణ కుటుంబాలకే కుళాయి నీటి సౌకర్యం ఉండగా.. 2026 జూన్ నాటికి ఈ సంఖ్య 82 శాతానికి పైగా పెరిగింది. జల్ జీవన్ మిషన్‌తో మహిళలకు నీటిని తీసుకురావడానికి వెచ్చించే సమయం గణనీయంగా తగ్గుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. జల్

జీవన్ పథకం కేవలం కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికే పరిమితం కాకుండా.. నీటి వనరుల పరిరక్షణ వంటి అంశాలపై కూడా దృష్టి పెడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేస్తూ,.....

వాయిస్ 15 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో నిర్వహించే వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాహనాల అనుమతులపై ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. డీజే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు మంజూరు చేయాలని హోంమంత్రి అనిత, డీజీపీని కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ, డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ నేపథ్యంలో అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి, వేగంగా అనుమతులు ఇవ్వాలని సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు సహకరించాలని పోలీసు శాఖకు విజ్ఞప్తి చేశారు.

---------------------------

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని ఎస్.యానం బీచ్‌లో స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బీచ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, ప్లాస్టిక్ సామగ్రిని తొలగించారు. భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం – ఇన్ కాయిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్ 25 సెకన్లు

---------------------------

రాష్ట్ర అగ్నిమాపక శాఖలో ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ను జారీ చేసింది. మొత్తం 147 డ్రైవర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేసేలా ఈ మేరకు పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ ను విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ తేదీలు, అర్హతలు, వయోపరిమితి, రాతపరీక్షల విధానంతో కూడిన నోటిఫికేషన్ పూర్తి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది..

---------------------------

ఆసుపత్రుల్లో రోగులకు అందించే భద్రతలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ తెలిపారు. 86 స్కోరుతో అత్యధిక సగటు మార్కులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచినట్లు ఢిల్లీలో జరిగిన ప్రపంచ రోగి భద్రతా దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని చెప్పారు. రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్రం సాధించిన పురోగతిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను, వైద్య సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగుల భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఆయన సూచించారు.

=====================